క్లుప్తంగా

హలో మాదిగ-చలో హైదరాబాద్‌ పోస్టర్ల ఆవిష్కరణ



జగ్గయ్యపేటఅర్బన్‌: ఈనెల 7 వ తేదీన హైదరాబాద్‌లో జరిగే హలో మాదిగ-చలో హైదరాబాద్‌ కార్యక్రమంలో భాగంగా వెయ్యి గొంతులు, లక్ష డప్పుల మహాసభ వాల్‌ పోస్టర్లను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్‌(తాతయ్య) విడుదల చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్‌ జిల్లా అధ్యక్షుడు మాతంగి దావీదుతో కలిసి ఎమ్మెల్యే తాతయ్య పోస్టర్లను విడుదల చేశారు. మాతంగి దావీదు మాట్లాడుతూ వెయ్యి గొంతులు, లక్ష డప్పుల మహాసభకు జగ్గయ్యపేట పట్టణం నుంచి పెద్ద సంఖ్యలో మాదిగలు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్‌ నాయకులు నకిరికంటి వెంకట్‌, ముండ్లపాటి ప్రసాద్‌, కారుపాటి డేవిడ్‌, మారేపల్లి శౌరి, మల్లెల కొండయ్య, మార్కపూడి వంశీ, కోట ప్రభూజీరావు, అన్నెపాగ దుర్గామహేశ్వరరావు, శేఖరబాబు, ముండ్లపాటి రాము, బోయ రంజిత్‌ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో రథసప్తమి వేడుకలు



ధర్మవరప్పాడుతండా(జగ్గయ్యపేట): గ్రామంలోని మండల పరిషత్‌ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం రథసప్తమి సందర్భంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు సూర్యనమస్కారాలు చేశారు. ముందుగా సూర్యభగవానుడి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ సకల ప్రాణకోటికి సూర్యుడే జీవనాధారం అని యోగాసనాలు, ప్రాణాయామం కలిపి చేసేది సూర్యనమస్కారాలన్నారు. వీటిని చేయడం వలన సత్ఫలితాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మంగతాయారమ్మ, ఉపాధ్యాయులు సుజాత, ఆరోగ్యమేరి, లక్ష్మణరావు, దయామణి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు. వేదాద్రి గ్రామంలో ఉన్న యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సుదర్శన నరసింహయాగం నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

పెనుగంచిప్రోలు: స్థానిక మునేరు అవతల మామిడి తోటలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో మంగళవారం సిబ్బందితో దాడి చేసినట్టు ఎస్‌ఐ ఎంఎస్‌కే అర్జున్‌ తెలిపారు. ఈ దాడిలో రూ.1,45,800 నగదుతో పాటు 10 సెల్‌ఫోన్లు, 10 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

డోన్‌ సీఐపై కఠిన చర్యలు తీసుకోవాలి

ఆంధ్ర న్యాయవాదుల సంఘం



గాంధీనగర్‌(విజయవాడసెంట్రల్‌): నంద్యాల జిల్లా డోన్‌ పట్టణానికి చెందిన న్యాయవాది లక్ష్మీశెట్టి కృష్ణప్రసాద్‌పై అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులకు గురిచేస్తున్న డోన్‌ సీఐ ఇంతియాజ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆంధ్ర న్యాయవాదుల సంఘం డిమాండ్‌ చేసింది. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆంధ్ర న్యాయవాదుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.రాజారామ్‌ మాట్లాడుతూ న్యాయవాది లక్ష్మీశెట్టి కృష్ణప్రసాద్‌ను గత కొద్ది నెలలుగా సీఐ ఇంతియాజ్‌ ఇబ్బందులకు గురిచేస్తున్నాడని చెప్పారు. పోలీసు ఉన్నతాధికారులు సీఐ ఇంతియాజ్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. న్యాయవాది మేడా శ్రీనివాస్‌ మాట్లాడుతూ కృష్ణ ప్రసాద్‌కు రక్షణ కల్పించాలని డిమాండ్‌ చేశారు. సమావేశంలో న్యాయవాది కృష్ణప్రసాద్‌, హరి, సతీష్‌బాబు పాల్గొన్నారు.

దుర్గాపురంలో సమస్యలు త్వరలో పరిష్కరిస్తాం

జగ్గయ్యపేటఅర్బన్‌: పట్టణంలోని దుర్గాపురంలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్‌(తాతయ్య) మంగళవారం కూటమి నేతలతో కలిసి పర్యటించారు. పలు వీధులకు వెళ్లి స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. లో వోల్టేజ్‌ కారణంగా ఇబ్బంది పడుతున్నామని, పలు వీధుల్లో నూతనంగా విద్యుత్‌ స్తంభాలను ఏర్పాటుచేయాలని స్థానిక ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఎమ్మెల్యే తాతయ్య సంబంధిత అధికారులతో మాట్లాడి వారి సమస్యలు త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రానున్న వేసవి దృష్ట్యా వార్డులో నీటి సమస్య లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్‌ చైర్మన్‌ రంగాపురం రాఘవేంద్ర, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి మైనేని రాధా, ఉపాధ్యక్షుడు షేక్‌ ఖాసిం, వార్డు కౌన్సిలర్‌ అలేఖ్య, మున్సిపల్‌ కౌన్సిలర్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

బెల్టు తీశారు..!

- గ్రామాల ప్రగతిని గాలికొదిలేశారు
- విచ్చలవిడిగా వీధుల్లో గొలుసు దుకాణాలు
- స్టిక్కర్‌ వేసి ఎమ్మార్పీ ధరకంటే అదనంగా బెల్టు దుకాణాలకు విక్రయం
- దానిపై మరో రూ.50 అదనంగా వసూలు చేస్తున్న బెల్టు దుకాణదారులు
- మొత్తంగా మందుబాబుల జేబులు ఖాళీ చేస్తున్న వైనం

వైఎస్సార్‌ సీపీ పాలనలో గ్రామ సచివాలయాల ఏర్పాటుతో పాటు రైతు భరోసా కేంద్రాలు, ఆరోగ్య సురక్ష కేంద్రాలతో మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం దిశగా పాలన సాగించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వ పాలనలో గ్రామాల ప్రగతిని గాలికొదిలేశారు. గ్రామాల్లో బెల్టు షాపులను ఒక ఉద్యమంలా నెలకొల్పుతూ సామాన్యుల జేబులు లూటీ చేస్తున్నారు.



కంచికచర్లలో బెల్టుషాపులకు విక్రయించిన స్టిక్కర్‌ వేసిన మద్యం సీసాలు

కంచికచర్ల: కూటమి ప్రభుత్వ పాలనలో గ్రామాల ప్రగతి కుంటుపడి బెల్టుషాపులు బాగా అభివృద్ధి చెందుతున్నాయి. టెండర్లు లేకుండానే మద్యం దుకాణాలతో సమానంగా బెల్టుషాపుల్లో విక్రయాలు జరుగుతున్నాయి. బెల్టుషాపులతో మద్యం ప్రియులకు ధన నష్టం, నిర్వాహకులకు లాభసాటిగానే ఉంది. కాని వీటి నిర్వహణతో ప్రజల నుంచి వస్తున్న విమర్శలు ప్రభుత్వానికి తలవంపులు తెస్తున్నాయని సాక్షాత్తు కూటమి నాయకులే అంటున్నారు. గత ప్రభుత్వంలో ఎక్కడా బెల్టుషాపుల ఊసే లేదు. ఒక వేళ అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులు, సెబ్‌ అధికారులు దాడులు చేసి నిర్వాహకులపై కేసులు నమోదు చేసేవారు. అధికార పార్టీకి చెందిన వారైనా సరే కేసుల నమోదులో వెనకాడేవారు కాదు. దీంతో అక్రమ విక్రయాలు జరగకుండా కట్టడి అయ్యేవి. తెలంగాణ మద్యం విక్రయాలు, రవాణాను పూర్తిగా నిషేధించారు. అయితే కూటమి ప్రభుత్వంలో ప్రతి గ్రామంలో బెల్టుషాపులు పుట్టుకొచ్చి మద్యం ప్రియులకు చేరువయ్యాయి.

స్టిక్కర్‌ వేసి బెల్టుషాపులకు మద్యం విక్రయాలు...

మద్యం షాపు నిర్వాహకులు గ్రామాల్లోని బెల్టు షాపులను ప్రోత్సహిస్తున్నారు. మద్యం బాటిల్‌కు ఎమ్మార్పీ ధర కంటే అదనంగా పది రూపాయలకు బెల్టుషాపులకు విక్రయిస్తున్నారు. బెల్టుషాపుల నిర్వాహకులు దానిపై అదనంగా క్వార్టర్‌ బాటిల్‌కు రూ.50కు విక్రయిస్తూ మందుబాబుల జేబులను కొల్లగొడుతున్నారు. అంతేకాకుండా సీలు వేసిన మద్యం బాటిళ్లు విక్రయిస్తున్న బెల్టు షాపుదారుడిని పట్టుకోవద్దని ఎక్సైజ్‌ శాఖ అధికారులకు మద్యం షాపు నిర్వాహకులు చెప్పారని బెల్టుషాపుల నిర్వాహకులు అంటున్నారు.

ఉన్న డబ్బంతా మద్యానికే...

గ్రామాల్లో బెల్టుషాపులు పుట్టుకొచ్చినప్పటి నుంచి ఆ ఊళ్లలోని పేదింటి ఇళ్లల్లో సంపాదనంతా మద్యం కొనుగోలుకే సరిపోతోంది. కూలి పనులతో రోజుకు సగటున రూ.500 సంపాదిస్తున్నారు. ప్రతి ఇంటికి చేరువలోనే మద్యం అందుబాటులో ఉంటోంది. సంపాదించిన సొమ్మంతా మద్యానికి ధారపోస్తున్నారు. దీంతో ఇళ్లలో పస్తులుండటం...మరోవైపు రోగాలబారిన పడి ఆసుపత్రుల పాలయి మృత్యువాత పడటం జరుగుతోంది. దీని వల్ల గ్రామాల్లో కుటుంబాలు కుటుంబాలే వీధిన పడుతున్నాయి.

కుటుంబాల్లో చిచ్చు పెడుతున్న మద్యం

ఇటీవల కంచికచర్ల మండలం కీసర గ్రామంలోని మద్యం దుకాణం వద్ద గండేపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పూటుగా మద్యం తాగి రోడ్డుపై పడ్డాడు. తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. కంచికచర్లలో మద్యం షాపు వద్ద మద్యాన్ని తాగి బైక్‌పై ఇంటికి వెళుతున్న వ్యక్తి ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొని తీవ్రగాయాల పాలయ్యాడు. ఇంత జరిగినా ప్రభుత్వ అధికారులు మాత్రం బెల్టుషాపులపై ఏ విధమైన చర్యలు తీసుకోవటం లేదు. సొమ్మంతా మద్యానికి తగలేస్తున్నారంటూ కుటుంబాల్లో గొడవలు చెలరేగుతున్నాయి. కుటుంబాల మధ్య ఇంతటి చిచ్చుకు కారణమవుతున్న బెల్టుషాపులపై ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోవటం లేదంటూ మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బూదవాడలో అసిస్టెంట్‌ కలెక్టర్‌ పర్యటన



రైతులతో మాట్లాడుతున్న అసిస్టెంట్‌ కలెక్టర్‌

బూదవాడ(జగ్గయ్యపేట): గ్రామంలోని రైల్వే లైన్‌ భూములను ఎన్టీఆర్‌ జిల్లా అసిస్టెంట్‌ కలెక్టర్‌ శుభం నోఖ్వాల్‌ మంగళవారం పరిశీలించారు. గ్రామంలో కొన్ని సంవత్సరాల క్రితం రైల్వే లైన్‌ ఏర్పాటు కోసం ప్రభుత్వం భూ సేకరణ చేసింది. అయితే ఆ సమయంలో 22 మంది రైతుల వద్ద ఏడెకరాల భూమి కొనుగోలు చేసి రైతులకు నష్టపరిహారం అందించలేదు. ఈ విషయమై రైతులు ఇటీవల ఉన్నతాధికారులకు చేసిన ఫిర్యాదు మేరకు అసిస్టెంట్‌ కలెక్టర్‌ ఆ భూములను పరిశీలించారు. ఇన్‌చార్జ్‌ తహసీల్దార్‌ మనోహర్‌ను భూములకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నందిగామ ఆర్డీవో బాలకృష్ణ, ఆర్‌ఐ సూరమ్మ, సర్వేయర్‌ అనూష్‌, రైతులు పాల్గొన్నారు.

పిట్ట పోరు.. పిట్ట పోరు పిల్లి తీర్చినట్టు...

- ఎంపీ, ఎమ్మెల్యే సూచించిన వ్యక్తులను కాదని మంత్రి ఆదేశాలతో మూడవ వ్యక్తికి చైర్‌పర్సన్‌ పదవి
- చైర్‌పర్సన్‌ ఎన్నిక అనంతరం పార్టీ కార్యాలయానికి వెళ్లకుండా ఇంటిబాట పట్టిన ఆశావహులు
- ఎమ్మెల్యే తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్న టీడీపీ పట్టణ అధ్యక్షుడు

పిట్ట పోరు...పిట్ట పోరు..పిల్లి తీర్చిన కథ గుర్తుకొస్తోంది నందిగామ మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ ఎన్నిక జరిగిన తీరు చూస్తే...తెలుగుదేశం పార్టీలో ప్రజాప్రతినిధులైన ఎమ్మెల్యే, ఎంపీలు చైర్‌పర్సన్‌ అభ్యర్థిత్వానికి చెరొక అభ్యర్థిని ప్రతిపాదించిన నేపథ్యంలో ఏర్పడ్డ సంక్షోభాన్ని పరిష్కరించడానికి పార్టీ అధిష్టానం మంత్రి నారాయణను దూతగా పంపింది. నారాయణ మధ్యేమార్గంగా ఎమ్మెల్యే, ఎంపీలు ప్రతిపాదించిన ఇద్దరు అభ్యర్థులను కాకుండా మూడో అభ్యర్థి పేరును తెర మీదకు తీసుకువచ్చి ఆమె అభ్యర్థిత్వం ఖరారు చేశారు. అయితే దీంతో నందిగామ తెలుగుదేశం పార్టీలో భగ్గుమన్న విభేదాలను ఉపశమింపజేయవచ్చని అధిష్టానం భావించినప్పటికీ ఆచరణలో అందుకు విరుద్ధంగా జరుగుతోంది. చైర్‌పర్సన్‌ పదవిపై ఆశలు పెట్టుకున్న పలువురు కౌన్సిలర్లు అసంతృప్తి రాగం అందుకున్నారు. ఎన్నిక అనంతరం అసంతృప్తివాదులు అంతా పార్టీ కార్యాలయానికి వెళ్లకుండా అలిగి ఇంటి బాట పట్టడం గమనార్హం.

కంచికచర్ల: నందిగామలో మంగళవారం జరిగిన మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ ఎన్నిక విషయంలో ఎమ్మెల్యే, ఎంపీలు పట్టుకోల్పోయారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. నందిగామ మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ ఎన్నిక విషయంలో ఎంపీ కేశినేని శివనాథ్‌(చిన్ని) శాఖమూరు స్వర్ణలతను, ప్రభుత్వ విప్‌, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కామసాని సత్యవతిని చైర్‌పర్సన్‌ అభ్యర్థులుగా ఖరారుచేశారు. కాని వారు సూచించిన అభ్యర్థులను పక్కన పెట్టి పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఆదేశాల మేరకు మరో కౌన్సిలర్‌ మండవ కృష్ణకుమారి పేరును తెరమీదకు తీసుకువచ్చి చైర్‌పర్సన్‌ అభ్యర్థిగా ప్రకటించారు. ఎమ్మెల్యే, ఎంపీలు పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు మంత్రి ప్రకటించిన కౌన్సిలర్‌ను ఆమోదించి చైర్‌పర్సన్‌గా ఎన్నుకున్నారు. మొత్తంమీద నందిగామ నియోజకవర్గంపై పట్టు సాధించేందుకు పార్టీలో కొంతమంది నాయకులను తన వైపు తిప్పుకొని ఎంపీ చిన్ని చేసిన యత్నాలు ఫలించలేదు.

చైర్‌పర్సన్‌ ఎన్నిక తర్వాత అలకబూనిన కౌన్సిలర్లు...

మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ ఎన్నిక జరిగిన తర్వాత ఆశావహులు అలకబూనారు. నందిగామ పట్టణ టీడీపీ అధ్యక్షుడు యేచూరి రామకృష్ణ తన భార్య యేచూరి రత్నకుమారికి చైర్‌పర్సన్‌ పదవి ఇస్తారని ఎమ్మెల్యే సౌమ్య ఆశ చూపించారని, కాని తమను కాదని ఒకే సామాజిక వర్గానికి పదవులు ఇస్తున్నారని ఆరోపిస్తున్నారు. ''పార్టీలో కష్టం మాది పదవులు వేరొకరికా.. పార్టీలో సామాజిక న్యాయం కనిపించటం లేదు'' అని రామకృష్ణ అనుయాయులు అంటున్నారు. చైర్‌పర్సన్‌ ఎన్నిక అనంతరం రామకృష్ణ, రత్నకుమారి, మరికొంతమంది కౌన్సిలర్లు ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లకుండా ఇంటి బాట పట్టారు. మొత్తంమీద నందిగామ టీడీపీలో అసంతృప్తి జ్వాలలు ఇంకా భగ్గుమంటూనే ఉన్నాయి.

ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేస్తున్న కూటమి ప్రభుత్వం

వైఎస్సార్‌ సీపీ నేతలు మొండితోక జగన్‌మోహనరావు, తన్నీరు నాగేశ్వరరావు



పేట వైఎస్సార్‌ సీపీ కార్యాలయంలో మాట్లాడుతున్న నందిగామ మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

జగ్గయ్యపేట అర్బన్‌: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అరాచకాలకు పాల్పడుతూ, ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేస్తున్నారని వైఎస్సార్‌ సీపీ నందిగామ మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు, జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్సార్‌ సీపీ ఇన్‌చార్జ్‌ తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. జగ్గయ్యపేట వైఎస్సార్‌ సీపీ కార్యాలయానికి మంగళవారం వచ్చిన మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు కొద్దిసేపు తన్నీరు నాగేశ్వరరావుతో వారి వారి నియోజకవర్గాలలో నిర్వహిస్తున్న పార్టీ కార్యక్రమాల గురించి చర్చించారు. అనంతరం జగన్‌మోహనరావు మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న మున్సిపల్‌ ఉప ఎన్నికల్లో అనేక చోట్ల మెజార్టీ లేకపోయినప్పటికీ చైర్మన్‌, వైస్‌ చైర్మన్‌ పదవులను ఎలాగైనా కైవసం చేసుకోవాలని అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం దౌర్జన్యాలకు, అరాచకాలకు పాల్పడుతోందని తెలిపారు. దీనిపై తమ పార్టీ అధిష్టానం త్వరలో ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తుందన్నారు. తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో అప్రజాస్వామ్యబద్ధంగా జరుగుతున్న మున్సిపల్‌ ఎన్నికలను తక్షణమే వాయిదా వేయాలన్నారు. మున్సిపల్‌ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న అప్రజాస్వామిక విధానాలపై ఎన్నికల సంఘం తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై అఖిలపక్ష పోరాటం

సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి దోనేపూడి శంకర్‌



పేట సీపీఐ కార్యాలయంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి దోనేపూడి శంకర్‌

జగ్గయ్యపేటఅర్బన్‌: ఉచిత ఇసుక అక్రమ రవాణా అరికట్టడానికి అఖిలపక్షం ఏర్పాటుచేసి అక్రమార్కుల భరతం పడతామని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి దోనేపూడి శంకర్‌ అన్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలోని పలు ఇసుక రీచ్‌లు, సరిహద్దు చెక్‌ పోస్టులను మంగళవారం దోనేపూడి శంకర్‌ నాయకత్వాన సీపీఐ బృందం పరిశీలించింది. అనంతరం పట్టణంలోని సీపీఐ కార్యాలయం పిల్లలమర్రి భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ అనుమతులు లేని ఇసుక రీచ్‌ల నుంచి కొందరు నాయకులు, వారి అనుచరులు సరిహద్దు రాష్ట్రానికి అక్రమంగా తరలిస్తున్నారని ఆరోపించారు. దీనిపై జగ్గయ్యపేట పట్టణ పోలీస్‌ స్టేషన్‌లో ఇప్పటికే 55 కేసులు నమోదుకావడం గమనార్హం అన్నారు. సరిహద్దు ప్రాంతంలో ఉన్న గండ్రాయి చెక్‌పోస్టు వద్ద సీసీ కెమెరా పనిచేయకపోవడంతో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా జరుగుతోందన్నారు. దీనిపై పోలీస్‌ శాఖ దృష్టి పెట్టాలని కోరారు. 65 వ నంబర్‌ జాతీయ రహదారిపై చెక్‌పోస్టుల వద్ద సీసీ కెమెరాలు వాహనాల వైపు చూడాలే తప్ప భూమివైపు చూడటం సరి కాదని, మరింత కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాలలో సహజ వనరులను ఎవరు దోపిడీ చేసినా తమ పార్టీ సహించదని, ప్రజల పక్షాన పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి అంబోజి శివాజి, పేట పట్టణ కార్యదర్శి జూనెబోయిన శ్రీనివాసరావు, జిల్లా నాయకులు బుట్టి రాయప్ప, జిల్లా భవన నిర్మాణ సంఘం కార్యదర్శి సోనా రాజు, జిల్లా ఏఐవైఎఫ్‌ అధ్యక్ష, కార్యదర్శులు కరిసె మధు, లంకా గోవిందరాజులు, సామాజిక కార్యకర్త పల్లేటి కౌముది, ఆటో వర్కర్స్‌ యూనియన్‌ నాయకుడు గోడెల జనార్దన్‌ తదితరులు పాల్గొన్నారు.

యువత పాడి పరిశ్రమపై అవగాహన కలిగి ఉండాలి



గరికపాడు(జగ్గయ్యపేట): యువత పాడి పరిశ్రమపై అవగాహన కలిగి ఉండాలని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) కోఆర్డినేటర్‌ అచ్చుతరాజు అన్నారు. గ్రామంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో జగ్గయ్యపేట లైఫ్‌స్కిల్స్‌ ఒకేషనల్‌ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌ స్కిల్‌ ట్రైనింగ్‌లో భాగంగా పశు వైద్యంపై 45 రోజుల పాటు శిక్షణ పూర్తి చేసుకున్న వారికి మంగళవారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీఆర్సీ కళాశాలల చైర్మన్‌ రంగాపురం నరసింహారావు, ప్రిన్సిపాల్‌ జూటూరి వెంకటేశ్వర్లు, శాస్త్రవేత్తలు జశ్వంత్‌, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్‌ లక్ష్మణరావు ప్రచారం

జగ్గయ్యపేటఅర్బన్‌: పీడీఎఫ్‌ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్‌ లక్ష్మణరావును గెలిపించాలని కోరుతూ ప్రజా సంఘాల నాయకులు మంగళవారం పట్టణంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలిసి ఈనెల 27న జరగనున్న ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్‌ అభ్యర్థి లక్ష్మణరావును గెలిపించాలని కోరుతూ కరపత్రాలను పంచుతూ ప్రచారం నిర్వహించారు. పీడీఎఫ్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌సీహెచ్‌ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యారంగ పరిరక్షణకు, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల సమస్యల పక్షాన ఎన్నో పోరాటాలు చేసిన లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని కోరారు. ప్రజా సంఘాల నాయకులు వీవీ రాంప్రసాద్‌, రావెళ్ల శేషు, దాసరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక ఫలసాయం



పెండ్యాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న ఏఓ విజయకుమార్‌, రైతులు

కంచికచర్ల: సేంద్రియ ఎరువులతో తక్కువ పెట్టుబడితో అధిక ఫలసాయం పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి కె.విజయకుమార్‌ అన్నారు. మండలంలోని పెండ్యాల గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించటమే ధ్యేయంగా రైతులను ముందుకు నడిపించేందుకు ఉద్దేశించినదే పొలం పిలుస్తోంది కార్యక్రమం అన్నారు. సేంద్రియ ఎరువులతో తక్కువ పెట్టుబడితో అధిక ఫలసాయం పొందవచ్చని అన్నారు. రైతులకు పంట నమోదు ఆవశ్యకత, రాయితీలో అందుబాటులో ఉన్న కిసాన్‌ డ్రోన్‌ గురించి వివరించామన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు, విద్యార్థులు, రైతులతో కలసి మొక్కజొన్న పొలాన్ని సందర్శించారు. కార్యక్రమంలో గ్రామీణ వ్యవసాయ సహాయకులు గౌతమ్‌, రఘు, రైతులు పాల్గొన్నారు.

దడ పుట్టిస్తున్న కొండముచ్చులు



గ్రామంలో తిరుగుతున్న కొండముచ్చులు

మక్కపేట(వత్సవాయి): కొండముచ్చులు దడ పుట్టిస్తున్నాయి. గ్రామంలో విచ్చలవిడిగా తిరుగుతుండడంతో ప్రజలు భయపడుతున్నారు. నివాస ప్రాంతాలలోకి వచ్చి ఆగమాగం చేస్తున్నాయి. ఇంటి అవసరాల కోసం పెట్టుకున్న కూరగాయలు, ఆకుకూరల మొక్కలను నాశనం చేస్తున్నాయి. గుంపులుగా వస్తుండడంతో వీటిని చూసి ప్రజలు భయపడి పరుగులు తీస్తున్నారు. కర్రలతో పారదోలుదామని చూసినా ఇవి బెదరడం లేదు. నలుగురైదుగురు కలిసి తోలితేనే అవి పోతున్నాయి. కొన్నిసార్లు వీటి బారిన పడి అక్కడక్కడా ప్రజలు గాయపడిన ఉదంతాలు ఉన్నాయి. ఇళ్లలో జనం లేకపోతే ఇవి ఇష్టారాజ్యంగా చెలరేగిపోతున్నాయి. ఇళ్ల వరండాలలో పెట్టిన సామాన్లన్నీ చిందరవందర చేస్తున్నాయి. దొడ్లలో మొక్కలన్నీ పాడు చేస్తున్నాయి. అధికారులు వెంటనే స్పందించి వీటిని పట్టించాలని కోరుతున్నారు.

వేగం తగ్గించండి.. ప్రాణాలు కాపాడండి

జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో ఆర్టీఓ పద్మావతి



నందిగామ ఆర్టీఓ కార్యాలయంలో స్కూల్‌ బస్సు డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఆర్టీఓ పద్మావతి

కంచికచర్ల: జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా నందిగామ ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయం వద్ద మంగళవారం పలు ప్రయివేటు పాఠశాలల బస్సు డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. రోడ్డు రవాణా అధికారి ఎం.పద్మావతి మాట్లాడుతూ డ్రైవర్లు స్కూల్‌ బస్సులు నడిపే సమయంలో ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. బస్సుల్లో ఫస్ట్‌ ఎయిడ్‌ బాక్సులు తప్పనిసరిగా ఉండేలా చూడాలన్నారు. డ్రైవర్లు, అటెండర్లు యూనిఫాంలో ఉండాలని, అత్యవసర ద్వారం ఉండేటట్లు చూసుకోవాలన్నారు. మద్యం తాగి బస్సులు నడిపితే కేసు నమోదు చేసి జైలుకు పంపుతామన్నారు. మోటారు వాహన తనిఖీ అధికారి ఎం.పూర్ణిమ మాట్లాడుతూ స్కూల్‌ బస్‌లో పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించకూడదన్నారు. డ్రైవర్‌కు డ్రైవింగ్‌లో 5 ఏళ్ల పాటు అనుభవం ఉండాలని, బస్సులో విద్యార్థుల వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి బీఎస్‌కే ప్రభాకర లింగం, పలు పాఠశాలల డ్రైవర్లు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

22 క్వింటాళ్ల రేషన్‌ బియ్యం స్వాధీనం



రేషన్‌ బియ్యం వాహనాన్ని స్వాధీనం చేసుకున్న తహసీల్దార్‌, రెవెన్యూ సిబ్బంది

మైలవరం: మైలవరం బైపాస్‌ రోడ్డులోని లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్‌ కళాశాల జంక్షన్‌ వద్ద అనధికారికంగా ట్రక్కులో తరలిస్తున్న 22 క్వింటాళ్ల రేషన్‌ బియ్యం స్వాధీనం చేసుకున్నామని తహసీల్దార్‌ అబ్దుల్‌ దరియా మంగళవారం తెలిపారు. తహసీల్దార్‌ మాట్లాడుతూ వాహనాల తనిఖీల్లో భాగంగా ఏపీ07 టీడీ 3718 నంబర్‌ గల వాహనాన్ని పోలీసులు మంగళవారం తనిఖీ చేశారన్నారు. వాహనంలో 44 బస్తాలు (22 క్వింటాళ్లు) పీడీఎస్‌ బియ్యం పట్టుబడ్డాయని చెప్పారు. వాహనం డ్రైవర్‌ బచ్చనబోయిన వెంకట్రావు పల్నాడు జిల్లా గురజాల మండలం పెదగ్రహారం గ్రామానికి చెందినవాడుగా గుర్తించామన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి సరుకును మైలవరం పట్టణంలోని రేషన్‌ షాపు నంబర్‌ 4 కు తరలించామన్నారు.

శివరాత్రి లోపు బ్రిడ్జికి తాత్కాలిక మరమ్మతులు

ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్‌(తాతయ్య)



అగ్రహారం బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తాతయ్య, పక్కన మున్సిపల్‌ చైర్మన్‌ రాఘవేంద్ర

జగ్గయ్యపేటఅర్బన్‌: ఇటీవల వచ్చిన వరదల్లో మునిగిపోయి దెబ్బతిన్న అగ్రహారం బ్రిడ్జిని మహాశివరాత్రి లోపు తాత్కాలికంగా మరమ్మతులు చేపడతామని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్‌(తాతయ్య) అన్నారు. జగ్గయ్యపేట పట్టణం నుంచి ముక్త్యాల గ్రామం వెళ్లే రోడ్డులో పాలేటి నదిపై ఉన్న పురాతన అగ్రహారం బ్రిడ్జిని ఎమ్మెల్యే తాతయ్య పార్టీ నాయకులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా వేలాది మంది భక్తులు, ప్రజలు వరదల్లో దెబ్బతిన్న బ్రిడ్జిపై నుంచి ముక్త్యాలలో జరిగే తిరునాళ్లకు వెళ్లడంతో పాటు కృష్ణానదిలో పవిత్ర స్నానాలు చేసేందుకు, అదే ప్రాంతంలో ఉన్న కోటిలింగాల క్షేత్రాన్ని దర్శించుకునేందుకు ప్రయాణిస్తారని తెలిపారు. బ్రిడ్జి మరమ్మతుల నిమిత్తం నిధులు కేటాయించమని జిల్లా కలెక్టర్‌ను కోరామని, అలాగే సీఎస్‌ఆర్‌ నిధులు కేటాయించమని ఈ ప్రాంతంలో ఉన్న కర్మాగారాలను కూడా కోరామని చెప్పారు. శివరాత్రి లోపు ప్రజలకు, భక్తులకు అసౌకర్యం లేని విధంగా తాత్కాలిక మరమ్మతులు చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్మన్‌ రంగాపురం రాఘవేంద్ర, మున్సిపల్‌ మాజీ ఫ్లోర్‌ లీడర్‌ యలమంచిలి రాఘవ, కౌన్సిలర్లు నరసింహారావు, గొట్టె నాగరాజు, బుజ్జిబాబు, సైదేశ్వరరావు, వెంకట్రావు, వెంకట్‌, నాయకులు మల్లెల కొండయ్య, దువ్వల రామకృష్ణ, కృష్ణ పాల్గొన్నారు.

చత్తీస్‌గఢ్‌లో తెలుగు మహాసభలు

విజయవాడ కల్చరల్‌: చత్తీస్‌గఢ్‌ తెలుగు సంఘాల ఆధ్వర్యంలో మార్చి 8, 9వ తేదీల్లో జాతీయ స్థాయి తెలుగు మహాసభలను నిర్వహించనున్నట్లు తెలుగు సంఘం కన్వీనర్‌ ఎల్‌.రుద్రమూర్తి తెలిపారు. విజయవాడ గవర్నర్‌పేట ప్రపంచ తెలుగు రచయితల సంఘం కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. చత్తీస్‌గఢ్‌ రాష్ట్రంలో మూడు లక్షల మందికి పైగా తెలుగు వారున్నారని, సాంస్కృతికంగా, సామాజికంగా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. సాంస్కృతిక పునరుజ్జీవనానికి అక్కడి తెలుగు సంఘాల సహకారంతో మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చత్తీస్‌గఢ్‌ రాయపూర్‌ వేదికగా సభలు జరుగుతాయని చెప్పారు. ఉప ప్రధాన కార్యదర్శి ఎస్‌.గణేష్‌ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌ నుంచి ఉప ముఖ్యమంత్రి పవన్‌ కల్యాణ్‌, సాంస్కృతిక శాఖా మంత్రి కందుల దుర్గేషతోపాటు ఇతర రాజకీయ ప్రముఖులు, సాహితీవేత్తలు మహాసభలో భాగస్వాములు అవుతున్నట్లు వివరించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే తెలుగు వారికి ఆహ్వానం పలుకుతున్నట్లు తెలిపారు. తెలుగు సంఘాల ప్రతినిధి కొండప్ప వెంకట్రావ్‌ మాట్లాడుతూ సభలో పాల్గొనే వారు 98274 08575 నంబరులో సంప్రదించాలని కోరారు. సమావేశంలో ప్రపంచ తెలుగు రచయితల సంఘం గౌరవ అధ్యక్షుడు మండలి బుద్ధ ప్రసాద్‌, ప్రధాన కార్యదర్శి డాక్టర్‌ జీవీ పూర్ణచందు పాల్గొన్నారు.